తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1985 మినీకథల పోటీలో రు. 250/-లు బహుమతి పొందిన రచన

రవికి దాహం వేస్తోంది.

తన మంచం దగ్గరగా క్రింద పడుకున్న చెల్లెలు-బాలను లేపబోయి మానుకున్నాడు.

మంచం క్రింద మంచినీళ్లు అందుకోను అతికష్టం మీద ప్రక్కకి ఒత్తిగిల్లేడు. అతని బరువుకి తాళలేని మడత మంచం గుడ్డ కిర్రో...మొర్రో...మనటం-

''దొంగ!...దొంగ!...'' అన్న కేకలు వినిపించటం-

ఒకటి తరువాయి ఒకటిగా జరిగేయి.

నిద్రలో తల్లి కలవరిస్తోందేమోనని కొద్దిగా తల మాత్రం ఎత్తి- మంచం మీంచే-నడవాలోకి చూసేడు అతను.

నడవాలోని గుడ్డి దీపం వెలుగులో-

తెరచి ఉంచిన పెరటి గుమ్మంకి అడ్డంగా నిలబడి, పెరట్లోకి చూస్తూ-


''దొంగ...దొంగ...''అని మళ్లా అరచి తడబడుతూ గబగబా పెరటి తలుపులు మూసేస్తున్న తల్లి కనిపించింది అతనికి.

నడవాలోనే పడుకున్న అతని తండ్రి సుబ్బయ్య మెల్లగా లేచికూర్చున్నాడు. ఆయనది కంగారు పడే తత్వం కాదు.నిదానమే ప్రధానం.

పెరటి వరండాని ఆనుకొని ఉన్న గదిలోంచి అతని తమ్ముళ్లు –

''ఎక్కడ?...ఎక్కడ?...''అని — అరుచుకుంటూ ఒకరి వెనుక ఒకరుగా వీధి వరండాలోకి వచ్చిపడ్డారు.

''పెరట్లో...నూతి దగ్గర...''అని అరుస్తూ పెరటి తలుపుల క్రిందా మీదా



చిడతలు వేసేస్తోంది జానకమ్మ.

బాలకి కొద్దిగా అటుగా పడుకున్న రెండవ తమ్ముడుబుల్లి కనిపించలేదు-రవికి. అలవాటుగా చెప్పాపెట్టకుండా ఏసినీమాకో చెక్కేసి ఉంటాడు-అని అనుకున్నాడు అతను.

కప్పుకున్న దుప్పటి నిలువునా లాగేసుకొని,ఆ ముసుగులో గజగజా వణికిపోతోంది బాలదొంగ భయం వల్ల.

ఆ పిల్ల సాధారణంగా వీధి వరండాలో పడుకోదు. చీకటి అంటే తగని భయం. దొంగలంటే మరీ భయం.

సాయంకాలం స్నానాల గదిలో జారిపడిన ప్పుడు బెణికిన రవి నడుముకి అమృతాంజనం మర్దన చేస్తూ అక్కడే-నేలమీద-పడుకుండి పోయింది. మధ్య రాత్రిలో అతనికి ఏదేనా అవసరం వస్తే పలికేందుకు దగ్గరగా ఉంటుంది లెమ్మంటూ అక్కడే పక్కవేసి పడుకోబెట్టి దుప్పటి కప్పింది తల్లి.

చెల్లెలి భుజం తడుతూ ధైర్యం చెబుతున్నాడు రవి.

వరండాలోకి వచ్చిన ముగ్గురు అన్నదమ్ములూ,చెల్లెలు మీంచి గెంతుకుంటూ నడవాలోకి చేరారు. అప్పటికే సుబ్బయ్య కూడా లేచి పెరటి గుమ్మం వేపు అడుగువేసేడు.

''వద్దు...వద్దు...పెరట్లోకి వెళ్లకండి. వాళ్ల దగ్గర కత్తులూ... కటారులూ ఉన్నా ఉండొచ్చు'' అంటూ మూసిన పెరటి తలుపులకు అడ్డకర్ర పెట్టేసింది జానకమ్మ.

మూలనున్న తన స్కేట్ దండం తీసేడు-చిన్న.

పట్కు దులుపుకునే కర్ర అందుకున్నాడు-బుజ్జి.

కరాటే పద్ధతిలో చేతుల్ని కత్తుల్లా మార్చి సిద్ధంగా నుంచున్నాడు-చిట్టి.

''ఇంతమందిమి ఉన్నాం! తలుపులు తియ్...ఫరవాలేదు'' అంటూ భార్యకు ధైర్యం చెప్పేడు సుబ్బయ్య.

ససేమిరా అన్నట్లుగా గుమ్మంకి అడ్డంగా నిల్చున్న ఆమె దృష్టి-ఆత్రంగా-వీధి వాకిట్లోకే ఉంది.

చిట్టి గిర్రున వెనుదిరిగి, లేవబోతున్న రవిని వెనక్కితోసి-

## స్వపరిచయం

పేరుగాని ఫొటోగాని ప్రచురించుకోవడం లేదు. కొంతకాలం దాకా అజ్ఞాతంగానే ఉండడం నా అభిమతం.

వయసు 36 - ఉనికి చిన్నప్పణ్నుంచీ విశాఖపట్నమే -ఆర్ట్సులో ఇంజనీరింగ్ లో డిగ్రీ తీసుకున్నాను. కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం.

తొలి కథ ''సాక్షి''ని ప్రచురించిందీ, ఈ మలికథ ''దొంగలు''కి బహుమతి ప్రకటించిందీ-కూడా ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికే.

–'కేసరి'

''నువ్వు లేవబోకు! నడుం ఇంకా నొప్పి చేసేయగలదు''అని అరుస్తూ గెంతుకుంటూ గదిలోకి పరిగెత్తేడు. పెరటి వరండాలోకి ఉన్న కిటికీ తెరిచేడు.

'వంటింటి పెరటి తలుపులు తీసి పెరట్లోకి వెళ్తాడేమో దుందుడుకు వెధవ'అని తనలో తాను గొణుక్కొని, అలా చేయవద్దని హెచ్చరిక చేసింది జానకమ్మ.

నడవాలోని దీపం కాంతిలో తల్లి ముఖంలోని భయం ఆరాటం స్పష్టంగా కనిపిస్తున్నాయి రవికి.

'దొంగల్ని చూసి, భయపడి దూరంగా పారిపోక, గుమ్మం దగ్గరే కాపుకాసేటంతటి ధైర్యం అమ్మకు ఎక్కడిది? ఎప్పట్నుంచీ?'

దొంగలు...దొంగలని అరిచి సరాసరి ఐదునిమిషాలు కావొస్తోంది. ఈ పరికి వాళ్లు పారిపోయుంటారన్న విషయం అమ్మకు ఎందుకు తోచటం లేదు.

'అమ్మ వాళ్లని పెరట్లోకి ఎందుకు వెళ్లనివ్వటం లేదు? దొంగలు తంతారనేనా!

ఇంట్లో దీపాలన్నీ వేసేసి, నలుగురు మగాళ్లు పెరట్లోకి వెళ్లినా సరే పారిపోకుండా వీళ్లతో కలియబడి కొట్లాడుకోటానికి ఇదేమైనా తెలుగు సినీమా అనుకుంటోందా!

గ్రద్దల బారినుండి పిల్లల్ని రక్షించే పిల్లల కోడి పెట్టలా, చేతులు బారజాపి మూసిన తలుపులకు అడ్డంగా ఎందుకు అలా తచ్చాడుతోంది?

'పెరటి గుమ్మం దగ్గర కాపున్న అమ్మ దృష్టంతా వీధి వాకిట్లోకే ఉండటానికి

కారణమేమిటి?

ఇంత గలాటా జరుగుతున్నా ప్రక్కవాటా వాళ్ల అలికిడి లేదేం? వాళ్లా సినిమాకు వెళ్ళారా?'

రవి ఆలోచనలకూ అనుమానాలకూ అంతూపొంతూ లేదు.

తల్లి మాటలకూ చేతలకూ పొంతన లేదు. తల్లి ధోరణి చూస్తే ఎవరి బారినుండి ఆమె ఎవర్ని కాపాడుతోందో ఆతనికి అంతు చిక్కటంలేదు.

ఇంతలో-

"గది కిటికీ లోంచి చూసేను. పెరట్లో ఎవరూ లేరు. వంటిల్లు ఓకే!" అని అరుచుకుంటూ గది వరండాల మీదుగా నడవాలో తేలేదు చిట్టి.

"ఉహు...చీకట్లో వాడికి సరిగ్గా కనిపించి ఉండదు. ఎక్కడో...నూతివెనుకో...చెట్టు చాటునో పొంచి ఉండే ఉంటారు." అంటూ మూసిన తలుపుల్ని ఆనుకొని కదలకుండా అడ్డంగా నుంచుంది జానకమ్మ.

ఆమె దృష్టంతా వీధి వాకిట్లోకే ఉంది.

"నీ మొహం! తప్పుకో!"అంటూ రెక్క పట్టుకొని పక్కకి లాగేసేదు ఆమె భర్త. అడ్డగడియ తీసేదు చిట్టి.

"ఏవండీ," అంటూ జరగరానిదేదో జరిగిపోతున్నట్లుగా కీచుగా అరిచింది ఆమె. వీధి వాకిట్లోకి ఆత్రంగా చూసింది.

ఆమె ముఖం పాలిపోయి తెల్లగా సున్నం కొట్టినట్లుగా ఉంది.

"పిచ్చి భయం...నువ్వూనూ...జమాజట్టీలాంటి ఆరుగురం మగాళ్లం ఉన్నాం. మాకేమీ జరగదు-" అని చుట్టూ చూపిస్తూ-

"-బుల్లి ఏడీ?"అన్నాడు సుబ్బయ్య.

ఆమె గతుక్కుమంది. కట్టెలా బిగుసుకుపోయింది. కళ్లు విశాలమై పిచ్చి చూపులు చూస్తున్నాయి. క్రింద దవడ జారింది. మనిషి నిలువెల్ల వణికిపోతోంది. కాళ్లు చచ్చుపడిపోయిన దానిలా గోడను ఆసరాచేసుకొని మెలమెల్లగా చతికిలబడిపోయింది. వీధి వాకిట్లోకి సారించిన దృష్టిమాత్రం అలాగే ఉంది. అదే కడసారి చూపన్న ఆరాటం అందులో ఉంది. ఈ విషయం రవి దృష్టిని దాటి పోలేదు.



# దొంగలు

'కేసరి'

పెరటి తలుపులు వేసినప్పటి నుంచి తల్లి చూపంతా వీధి వాకిట్లోకే ఆత్రంగా సారించి ఉండటంలో పరమార్థం ఏమిటి? మెడ తిప్పి వీధి వాకిట్లోకి చూసేదు రవి.

వీధి గేటుకి వేసి ఉన్న తాళం కప్ప తప్ప మరేం లేదు అటు.

సందువేపు చూసేదు. వీధి వాకిల్నీ పెరట్నీ కలిపే ఒకే ఒక సందు ప్రక్కవాటా వేపు మాత్రమే ఉంది. ఆ సందు మెదలు

కనబడటం లేదు. మందడి గోడ అడ్డం. కొద్దిగా మెడ సారించేడు. సందు మెదట్లో ఎవరో తచ్చాడుతున్నట్లుగా తోచింది అతనికి. ఇంకొద్దిగా మీదకు జరిగితే స్పష్టంగా కనబడుతుంది. మీదకు జరగ ప్రయత్నించేడు.

"అమ్మా!"-నడుం నొప్పి-

''పెదబాబూ'' అన్న తల్లి పిలుపూ-

అతని ప్రయత్నాన్ని పట్టి నిలిపేసేయి.

పెరటి తలుపుల క్రిందామీదా విడితలు తీసిన బుజ్జి చిట్టిలతోసహా అందరూ తల్లీ కొడుకుల్ని చూసేరు.

''లేవకు! నడుంనొప్పి చేసేయగలదు.'' అంటూ కళ్లు దించేసుకుంది జానకమ్మ.

''లేవటం లే...'' అతని మాటపూర్తి కానివ్వకుండా, పెరటి తలుపులు తట్టిన చప్పుడు వినిపించింది.

పెరటి తలుపుల దగ్గర నిలబడిన వాళ్లు బిత్తరపోయి రెండు అడుగులు వెనక్కి వేసేరు. గోడకు చారబడి, తలమీద చేతులు వేసుకున్న జానకమ్మ దీర్ఘంగా నిశ్వసించింది.

''అమ్మా!...నాన్నగారూ!... తలుపు తీయండి. పెరట్లో ఎవరూ లేరు.''

ఆ గొంతు - ఇంతసేపై అతీగతీలేని - బుల్లిది.

'ఐతే, వీడు సినీమాకు వెళ్లలేదన్నమాట. మరి...'-అని ఆలోచిస్తున్న రవి మెదడులో ఓ మెరుపు మెరిసింది. అటు తెరుచుకున్న పెరటి గుమ్మంలోకి కాక, ఇటు - సాధ్యమైనంత మేరకు నడుం నొప్పి పంటి బిగువున భరించి, మెడా ఒళ్లా సారించి సందుమెదట్లోకి చూసేడు.

సందు మెదట్లో అతనికి స్పష్టంగా కనబడ్డ దృశ్యం అతణ్ని చకితుణ్ని చేసింది. అదే సమయంలో కలుక్కుమన్న అతని నడుంనొప్పిని కూడా అతను గుర్తించలేకపోయేడు.

రవి తల్లివేపు చూసేడు. ఆమె మొహం చాటేసుకుంది.

బుల్లివేపు చూసేడు. అతను - తను సందులోంచి పెరట్లోకి ఎలా వెళ్లిందీ, దొంగలు ఎలా పారిపోయిందీ, పెరడంతా జాగ్రత్తగా పరిశీలించుకుంటూ పెరటి గుమ్మం ఎలా చేరిందీ లాంటివి మిగిలిన వాళ్లకు చెబుతూ మధ్య మధ్య- తల్లి వేపు దొంగ చూపులు చూస్తున్నాడు.

జానకమ్మ బుల్లివేపు కన్నెత్తైనా చూడలేదు. రవిని ఓరకంట చూసింది. అతని చూపుతో చూపు కలపలేని దానిలా పక్కమీదకు వాలిపోయి, దుప్పటి ముఖం మీదకు లాక్కుంది.

చాలీ చాలని దుప్పటి ఆమె కాళ్లను కప్పలేకపోయింది. ఆమె కాళ్లను చూస్తూ కళ్లు మూసుకున్నాడు రవి.

మూసుకున్న అతని కళ్లలో తల్లి పాదాలు కరిగిపోయి, అంతకు క్రితం సందు మొదట్లో చూసిన దృశ్యం-

చెదిరిన కురులూ, జారిపోతున్నపైటా, నలిగిన చీరకుచ్చెళ్లా కంగారుగా సర్దుకొని, ఆదరా బాదరాగా తమ వాటాలోకి జారుకున్న ప్రక్కవాటావారి పదహారేళ్ల పడుచుపిల్ల పద్మ రూపం నిలిచిపోయింది.

❋




చుండ్రు?

PUMA

ప్యూమా హెర్బల్ ఏంటి-డేండ్రఫ్ అయిల్ వాడి దానిని అరికట్టండి.

ఇందులో వేప మున్నగు ఔషధ వనమూలికలు చేర్చబడినవి. ఏంటి సెప్టిక్ పదార్థంలా పనిచేసి చుండ్రు తొలగిస్తుంది. మాడుపై పొరలు పొరలు ఊడిపోవడాన్ని ఆపు చేస్తుంది. జుట్టు ఆరోగ్యంగా పెరిగేలా చేస్తుంది.

ప్యూమా మీకు విస్తృత శ్రేణిలో సౌందర్య సాధనాలను, వనమూలికలతో తయారుచేయబడిన ఔషధ గుణ యుక్త చికిత్సా పదార్థములను అందిస్తోంది. అన్నీ వనమూలికలను ఉపయోగించి ఆయుర్వేద ఫార్ములా రూపంలో రూపొందించబడినవి. ఎలాంటి కృత్రిమ వస్తుసారం కలపబడలేదు.

ప్రముఖ కెమిస్ట్ దుకాణాలలో, జనరల్ స్టోర్స్‌లో లభ్యం.

మీ రీటైలర్ నుండి కాని లేక మాకు కాని వ్రాసి 'ప్యూమాస్ గైడ్ టు బ్యూటీ' అనే ఉచిత ప్రతిని పొందండి.

ప్యూమా హెర్బల్ కాస్మటిక్స్ ప్రై. లి. కింగ్స్‌వే, నాగపూర్ 440 001.

RADEUS/PHC/1-85



నిశ్శబ్దంగా మీకోసం పనిచేస్తున్నవి

– సి పి సి ప్రీమియర్ పంపుసెట్లు

సి పి సి ప్రీమియర్ గృహోపయోగ పంపుసెట్లు పని చెయ్యటంలో అధిక పొదుపుచేసేవి. అత్యంత బలిష్ఠమైనవి ఏళ్ల తరబడి ఇబ్బంది కలిగించని సేవకు హామీ ఇచ్చేవి.

30 ఏళ్లనుండి ప్రీమియర్ పంపుసెట్లను తయారుచేస్తూవున్న సి పి సి వారిచే ఇవి తయారుచేయబడుచున్నవి.

సి పి సి ప్రీమియర్ గృహోపయోగ పంపుసెట్లు 1/8 హెచ్.పి. నుండి 2 హెచ్.పి. వరకు గల సైజులలో లభ్యం.

సి పి సి ప్రీమియర్ పంపుసెట్లు ఈ కంపెనీ బ్రాంచీలలోను, డీలర్ల మూలంగాను, అన్నిచోట్లా లభ్యమౌతున్నవి.

పంపుసెట్లు కొన్న తరువాత మీకు అవసరమైన సర్వీసు సౌకర్యాలు వారే చేయగలరు.



సిపిసి ప్రీమియర్

మీ కుడిచేయి వలె విశ్వసించ తగినది

కోయంబత్తూరు ప్రీమియర్ కార్పొరేషన్ (P) లిమిటెడ్

17-2-30, పొన్నియమ్మన్ కోయిల్ వీధి

చిత్తూర్-517 001 ఫోను : 3228 Grams : PREMIER CO.

23 TG. AJ V